క్లుప్తంగా

ఘనంగా ప్రియాంకాగాంధీ జన్మదినోత్సవం



వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జల్తారి సంపత్, నాయకులు మండల వెంకన్న, పెద్ది నగేష్, కొలిపాక వెంకటేశ్, నాగరాజు, సట్ల రవీందర్, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

ఏఎస్సై సిద్ధయ్యకు పదోన్నతి

దామెర : స్థానిక పోలీస్ స్టేషన్‌లో కొంతకాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్సై సిద్ధయ్యకు ఎస్సైగా పదోన్నతి లభించిందని ఎస్సై కొంక అశోక్ శుక్రవారం తెలిపారు. కాగా పదోన్నతి పొందిన సిద్ధయ్యను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిద్ధయ్యను సిబ్బంది అభినందించారు. అనంతరం సిద్ధయ్య సీపీ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పరామర్శ

నడికూడ : మండల కేంద్రానికి చెందిన జంగిలి సారమ్మ గురువారం మృతి చెందగా స్థానిక సర్పంచ్ ఊర రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సారమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

గృహహింస చట్టంపై అవగాహన



హన్మకొండ చౌరస్తా: వేధింపులకు గురవుతున్న మహిళలకు కేంద్రం ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన గృహహింస చట్టం రక్షణ కవచం లాంటిదని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ ఏ.శ్రీదేవి తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ మచిలీబజార్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్లకు గృహహింస చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ 2007లో రాష్ట్రంలో ఈ చట్టం అమలులోకి వచ్చిందని అన్నారు. చట్టం అమలు కోసం బాధితులకు సత్వర న్యాయం కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీని రక్షణాధికారిగా నియమించినట్లు తెలిపారు. బాధిత మహిళలకు న్యాయం అందించేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం కేస్ వర్కర్ వినీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో వైభవంగా కుడారై ఉత్సవం

హన్మకొండ కల్చరల్: ధనుర్మాసోత్సవంలో భాగంగా జిల్లాలోని పలు వైష్ణవ సాంప్రదాయ దేవాలయాల్లో కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయాల్లో స్వామివారికి పాయస నివేదనలు చేశారు. వరంగల్‌లోని బాల వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోపాల స్వామి గుడి, కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయం, గీతాభవన్, గోవిందరాజుల గుట్ట, హనుమకొండలోని సీతారామచంద్ర స్వామి కోవెల, రెవెన్యూ కాలనీ రామాలయం, రెడ్డి కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయం, అదాలత్ వెనుక ఉన్న శ్రీదేవి భూదేవి సహిత నీలావేంకటేశ్వర స్వామి, ఎక్సైజ్ కాలనీ, టీచర్స్‌కాలనీ, ఎన్ఈఓ కాలనీల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పాయస పరమన్నాలు నివేదించారు. కృష్ణపరమాత్మకు అమృతం వంటి పాయసాన్ని నివేదించే పండుగే కుడారై పండుగని, భక్తితో కొలిచే వారికి పరమాత్ముడు అమృతం వంటి పరమానందాన్ని అనుగ్రహిస్తాడని గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి ఉద్బోధించారు. హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రంలో శుక్రవారం ఉదయం ఆపదుద్ధారక స్వామిని వివిధ పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 పాత్రల్లో పాయసం నివేదించారు.

చెకుముకి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట రూరల్: జన విజ్ఞాన వేదిక సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ వేదికపై శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కాజీపేట మండల ప్రధాన కార్యదర్శి పాల కుమారస్వామి మాట్లాడుతూ ప్రజల్లోని మూఢ విశ్వాసాలను పారద్రోలడానికి జన విజ్ఞాన వేదిక ఎంతగానో కృషి చేస్తోందని వివరించారు. శారద, రమాదేవి పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానందుడు

- ఆయన చరిత్రను అందరూ తెలుసుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా వివేకానంద జయంతి
- నివాళులర్పించిన అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు



శాయంపేట : రిటైర్డ్ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందికి సన్మానిస్తున్న సభ్యులు

పరకాల : భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామివివేకానంద దేశ యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, సిటిజన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ నాగబండి విద్యాసాగర్ అన్నారు. స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద విగ్రహానికి ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, డాక్టర్ నాగబండి విద్యాసాగర్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద చెప్పినట్లు మీరు బలహీనులని భావిస్తే బలహీనులే అవుతారు.. బలీయమైన శక్తులుగా భావిస్తే బలవంతులుగా తయారవుతారన్న సూక్తి ఎంతో మంది యువకుల భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆయన చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బండి సారంగపాణి, ఆర్‌పీ జయంత్‌లాల్, బెజ్జంకి పూర్ణచారి, మార్త రాజభద్రయ్య, మార్త భిక్షపతి, బొజ్జపల్లి సుభాష్, గాజుల నిరంజన్, బాసాని సోమరాజు, పాలకుర్తి తిరుపతి, మెంతుల సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత సంకల్పంతో ముందుకు సాగడంతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ అరుణ, డాక్టర్ ఇందిరాదేవి, డాక్టర్ రాజయ్య, సుస్మిత, డాక్టర్ సుబాషిణి, సంజయ్, శ్యాంసుందర్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓదేలు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం వివేకానంద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సై దేవేందర్, విగ్రహదాత లెక్కల జలేందర్‌రెడ్డి–లక్ష్మి దంపతులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు వేముల ప్రతాప్‌రెడ్డి, కర్ణపురం రాజవీరు, బలిజే నర్సింహరాములు, వినుకొండ ఉపేంద్రం, గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు సారంగం, విమలను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి మెమోంటో అందించారు. ఈ సందర్భంగా ఎస్సై దేవేందర్ మాట్లాడుతూ.. యువకులు వివేకానందుడి ఆశయాలను కొనసాగించాలన్నారు. యువత సన్మార్గంలో నడవాలని, వ్యసనాలకు బానిసవద్దని సూచించారు. అనంతరం గ్రామస్తులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ మండల అధ్యక్షుడు గిద్దమారి సురేష్, సభ్యులు చల్లా రాజిరెడ్డి, బాసాని విద్యాసాగర్, పాడిశెట్టి గణేష్, మేరగుర్తి కర్ణాకర్, కానుగుల నాగరాజు, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, శ్రీమత్స్యగిరిస్వామి ఆలయ కమిటీ చైర్మన్ భిక్షపతి, సమ్మిరెడ్డి, బాసాని నవీన్, రాజు, రాజేష్, రవి, రాజేందర్, ప్రవీణ్, స్వరూప, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



పరకాల : వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు



కమలాపూర్ : వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

కమలాపూర్‌లో..

కమలాపూర్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రగతి యువ జన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, యూత్ అధ్యక్షుడు మండ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. నేటి యువతకు వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు పుష్పలత, శ్రీదేవి, డాక్టర్ సాంబశివయ్య, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, మలయ్య, ప్రగతి యూత్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఓంకేష్, జగన్, కరణ్, దేవేందర్, కిశోర్, యాదగిరి, లోకేష్, రక్షిత్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో పెండింగ్ బిల్లులు కోసం సభలో చర్చ
- జెడ్పీ చైర్మన్, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం



పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్, సర్పంచ్, ఎంపీటీసీలు

ఎల్కతుర్తి : గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని, పెండింగ్ బిల్లులను వెంటనే విడదల చేసి తమను ఆదుకోవాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. రబీ సీజన్ దగ్గరపడుతోందని, రైతుబంధు డబ్బులు ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ కూడా కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బావుపేట సర్పంచ్ రైతుబంధు డబ్బులు జమ అయ్యాయని సెల్‌ఫోన్‌లో మెసేజ్ చూపించారు. కాంగ్రెస్ నాయకులకే జమ అయ్యాయి కావచ్చు కానీ ఇతరులకు రైతుబంధు డబ్బులు జమ కాలేదని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు విమర్శించారు. అలాగే రేషన్ షాపుల్లో ఇంకా బియ్యం పంపిణీ చేయడం లేదని, పండుగ సందర్భంగా పిండివంటలు చేసుకోవడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంపిణీ చేయాలని తహసీల్దార్ జగత్‌సింగ్‌ను ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. రైతులు యాసంగిలో సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏఓ రాజ్‌కుమార్ కోరారు. రెండెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ఈనెల 30వ తేదీ వరకు రైతుబంధు డబ్బులు జమ అవుతాయని బావుపేట సర్పంచ్ రాముడు తెలిపారు. విశాల సహకార సంఘంలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో చైర్మన్ తెలిపారు. అయితే గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్‌ను కోరినా మంజూరు చేయలేదని, సభకు ఎందుకు వచ్చారో చెప్పాలని బావుపేట సర్పంచ్ దాట్ల రాముడు, ఎంపీటీసీ ఇంద్రసేనారెడ్డి జెడ్పీ చైర్మన్‌ను ప్రశ్నించారు. దీంతో జెడ్పీ చైర్మన్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా ముందుకెళ్లాలని అన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

పదవులు ఉన్నా.. లేకపోయినా ప్రతిఒక్కరూ గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఎంపీడీఓ తూర్పాటి సునీత, తహసీల్దార్ జగత్‌సింగ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, పలు శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీతో సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు : గ్రానైట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దాపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాక్ గ్రానైట్ కంపెనీ యాజమాన్యం ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. యాక్ కంపెనీ యాజమాన్యం కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం సీఐటీయూ అనుబంధ గ్రానైట్ కార్మికుల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాగుల రమేష్, అధ్యక్షుడిగా పెంతల రవీందర్, ఉపాధ్యక్షులుగా కొమ్ముల భద్రయ్య, కక్కెర్ల నాగేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శిగా బొమ్మగాని సారయ్య, సహాయ కార్యదర్శులుగా నాగనబోయిన రాజు, మంత్ర గోవర్ధన్, కోశాధికారిగా వేల్పుల సురేష్, కమిటీ సభ్యులుగా భిక్షపతి, రాజబాబు, రవి, హరికృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

శాయంపేట : / నడికూడ : / వేలేరు : సంక్రాంతి పండగ సందర్భంగా పతంగులు ఎగురవేసే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని శాయంపేట విద్యుత్‌శాఖ ఏఈ రాజ్‌కుమార్, నడికూడ విద్యుత్ శాఖ ఏఈ కె. విశ్వప్రసాద్, వేలేరు మండల విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలిపటాలు ఎగరవేయద్దని సూచించారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పతంగులు పడితే తీసుకునే ప్రయత్నం చేయకూడదన్నారు. రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు తీయొద్దని, ఇంటి డాబాలపై విద్యుత్ లైను ఉన్న దగ్గర పతంగులు ఎగవవేసే ప్రయత్నం చేయొద్దని కోరారు. తల్లిదండ్రులు, పెద్దవాళ్లు పిల్లలను స్లాబులపైకి వెళ్లకుండా చూడాలని కోరారు.

క్రీస్తుజ్యోతి మందిరం సందర్శన



పిడమర్తి రవిని ఆశీర్వదిస్తున్న పాల్సన్‌రాజ్

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం క్రీస్తుజ్యోతి మందిరాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు డాక్టర్ పాల్సన్‌రాజ్, జయప్రకాశ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రవి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో చర్చి కరుణాపురం క్రీస్తుజ్యోతి మందిరమని, సందర్శించడం తనకు అనుభూతిని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన నాయకులు అనంతపురం కమలేష్, దేవరకొండ నరేష్, జోగారపు మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



కమలాపూర్ : సేవ్ గర్ల్ ముగ్గు వేసిన విద్యార్థినులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, శిశుమందిర్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి మాట్లాడుతూ.. తెలుగు ప్రజలు నిర్వహించుకునే పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. అనంతరం విద్యార్థినులు అందమైన రంగవల్లులు అలంకరించి గొబ్బెమ్మలు పెట్టగా, విద్యార్థులు పతంగులు ఎగురవేసి సంబురాలు జరిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు పుష్పలత, శ్రీదేవి, డాక్టర్ సాంబశివయ్య, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, మల్లయ్య, కళాశాల సిబ్బంది కొండయ్య, శ్రీనివాస్, కరుణ, శ్వేత, శిశుమందిర్ ఆచార్యులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పరకాల : విద్యార్థినులు వేసిన ముగ్గు

పరకాలలో..

పరకాల : పట్టణంలోని డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ముందస్తు సంబురాలను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు నిర్వహించిన రంగోళి కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. యువత సంకల్పంతో ముందుకు సాగడంతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. విద్యార్థినులు వేసిన సంక్రాంతి ముగ్గులు పలువురికి ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు



ఒడిబియ్యం సమర్పిస్తున్న అర్చకులు, మహిళలు



నీరాట్టోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్య కైంకర్యాలు, ధనుర్మాస సేవాకాలం పూర్తి అయిన తర్వాత గోదా అమ్మవారికి నీరాట్టోత్సవం (అభిషేకం) జరిపించారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమం వైభవోపేతంగా అర్చకులు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, అమ్మవారికి విశేషమైన కుంకుమ పూజ జరిపించారు. మహిళా భక్తులు ఒడిబియ్యం సమర్పణ, కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా శనివారం 6.30 గంటలకు ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ కోరారు.

సర్వసభ్య సమావేశం నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపిటీసీలు

శాయంపేట : మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహించాలని ఎంపిటీసీలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి ఎంపిటీసీలు బాసాని చంద్రప్రకాష్, గజ్జి ఐలయ్య, బత్తిని రజిని, మేకల శ్రీనివాస్, అజ్మీరా ఉమా, మాచర్ల మంగమ్మ వినతిపత్రం అందించారు. ఈనెల 5న మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా ఎంపీటీసీలు గైర్హాజరవడంతో కోరం లేక సభను అధికారులు వాయిదా వేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని, వాయిదా వేసిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెలాఖరులోగా నిర్వహించాలని వారు కోరారు. సభ్యులు కూడా సమావేశానికి హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ స్పందించి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

14న రంగనాయకుల కల్యాణ మహోత్సవం



మండల కేంద్రంలోని శ్రీశివమార్కండేయ, వేంకటేశ్వర స్వామి ఆలయం

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీశివమార్కండేయ, వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండుగను పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన గోదా రంగనాయకుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రాగణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన ఉదయం రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గోదా రంగనాయకుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆరె సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరిలో శుక్రవారం ఆరె సంఘం క్యాలండర్‌ను ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వజ్ర కిషన్‌రావు ఆవిష్కరించారు. ఆరె కులస్తులు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ రకార్యక్రమంలో తిరుమలగిరి సర్పంచ్ రంపీస మనోహర్, సిరిసె చందర్ రావు, రామేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు సాంబయ్య, వీరన్న, మనోహర్, యుగేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ వెంకటేశ్

ధర్మసాగర్ : డీసీసీబీ బ్యాంకులో డిపాజిట్ చేసిన నగదుకు డిపాజిట్ పథకం ద్వారా 8.10 శాతం అత్యధిక వడ్డీ అందిస్తున్నట్లు ఆ బ్యాంకు ధర్మసాగర్ బ్రాంచ్ మేనేజర్ ఆర్ వెంకటేశ్ తెలిపారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ధర్మసాగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి ఆర్థిక సౌజన్యంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక రుణాలు, మార్టిగేజ్, కోళ్ల పరిశ్రమ, గొర్రెలు, మేకలు, గెదెల కొనుగోలు, ట్రాక్టర్, హార్వెస్టర్ కొనుగోలు, విదేశాలకు ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు లోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ రకాల రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ విజేందర్‌రెడ్డి, సర్పంచ్ అవనిజరెడ్డి, విప్లవ్‌కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను వితరణ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవిరాజుకు అక్షింతలు అందించారు. వివిధ గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత



శాయంపేట : స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అండర్ 17 బాలబాలికల పోటీల్లో ఎంపికైన మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సయ్యద్ సమీనకు మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ ఆర్థిక సాయం అందించారు. ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సుజియాబాద్ పట్టణంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో సమీన పాల్గొననుంది. ఈ సందర్భంగా చంద్రప్రకాశ్ అభినందించి క్రీడాకారిణి ప్రయాణ ఖర్చు కోసం రూ. 3వేల సాయం అందించారు. పీఈటీ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.